సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 25 । జనవరి । 2023



చలిగాలుల విజృంభణ
జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో మన్యం వాసులు చలి తీవ్రతకు వణికిపోతున్నారు. 8లో



గిరి విద్యార్థుల ఆరోగ్యమే ఐటీడీఏ లక్ష్యం 8లో
పాడేరు ఐటీడీఏ పరిధిలోని గిరి విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టింది.



పాలించే స్థాయికి ఎదగాలి
మార్గదర్శకులను ఆదర్శంగా తీసుకుని పాలించే స్థాయికి బాలికలు ఎదగాలని డీఎంహెచ్‌వో జమాల్‌బాషా ఆకాంక్షించారు. 9లో

న్యూస్‌రీల్

ఇంటర్ పాసైన విద్యార్థులకు సువర్ణావకాశం

జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి రోహిణి

అడ్డతీగల: ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థ సువర్ణావకాశం కల్పిస్తుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిణి పి.రోహిణి తెలిపారు. 2021 లేదా 2022 సంవత్సరంలో ఇంటర్మీడియట్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైతే హెచ్‌సీఎల్ టెక్‌బీ ఎర్లీ కెరీర్ ప్రోగ్రామ్ ద్వారా శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ ప్రోగ్రామ్‌కి ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు స్టైఫండ్‌తో ఆరు మాసాలు ఇంటర్న్‌షిప్ మరో ఆరు మాసాలు శిక్షణ తీసుకోవచ్చన్నారు. శిక్షణ పూర్తి అయిన తర్వాత హెచ్‌సీఎల్‌లో పూర్తిస్థాయి ఉద్యోగం లభిస్తుందన్నారు.అలాగే ఉన్నత విద్య (ఐఐఎం, బిట్స్, శస్త్రా, కేఎల్)ను ఆయా విశ్వవిద్యాలయాల్లో స్కాలర్‌షిప్‌తో ప్రారంభించవచ్చన్నారు. గణితయేతర విద్యార్థులు కూడా ఇందులో పాల్గొనవచ్చని ఆమె సూచించారు.

అథ్లెటిక్స్‌లో గురుకుల కళాశాల విద్యార్థి ప్రతిభ

మారేడుమిల్లి: స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల విద్యార్థి నాగ సురేష్ 66వ ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అథ్లెటిక్ 2023 అండర్ 19లో ప్రతిభ కనబరిచాడు. ఈ నెల 20 నుంచి 23వరకు శ్రీకాకుళంలో జరిగిన రాష్ట్రస్థాయి మీట్‌లో 1500 మీటర్ల రన్నింగ్‌లో అతనితోపాటు ఎ.ఉదయ్‌కిరణ్‌రెడ్డి, జావెలిన్ త్రోలో జె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారని కళాశాల ప్రిన్సిపాల్ పీఎస్ఆర్ ఆంజనేయులు తెలిపారు. వీరికి మారేడుమిల్లి సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు రాము, జ్వాల సాగర్ తర్ఫీదు ఇచ్చారని ఆయన వివరించారు.

ఉన్నత లక్ష్యంతో ఎదగాలి

రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవరం: ఏజెన్సీలోని మంచి లక్ష్యం నిర్దేశించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే సూచించారు. మండలంలోని ఇర్లపల్లిలోని బాలికల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల పాఠశాలలో ఐసీడీఎస్ ద్వారా ఏర్పాటు చేసిన జాతీయ బాలిక దినోత్సవంలో ఆయన మాట్లాడారు. బాలికల రక్షణ కోసం అనేక చట్టాలు అమలు చేస్తోందన్నారు. ఏజెన్సీలో బాల్య వివాహాలు జరగకుండా గ్రామ సచివాలయాలల మహిళా పోలీసులు,శిశు సంక్షేమ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. బాలికల సమస్యలు తెలుసుకునేందుకు ఆశ్రమ పాఠశాలల్లో ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆయన బాలికలతో మాట్లాడారు. సీడీపీవో సంధ్యారాణి, ఏటీడబ్ల్యూవో రామతులసి, డాక్టర్ రాధిక, హెచ్ఎం రాజేశ్వరి, పీడీ రామయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేకేలైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): భద్రతాకారణాల దృష్ట్యా కేకే లైన్‌లో నడిచే పలు రైళ్ల గమ్యం కుదింపు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 25,26 తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్ దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 26,27 తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(18513)ఎక్స్‌ప్రెస్ కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుండి విశాఖపట్నం చేరుకుంటుంది. ఆయా తేదీల్లో దంతేవాడ-కిరండూల్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. అలాగే ఈనెల 25,26 తేదీల్లో విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రైలు దంతేవాడ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈనెల 26, 27 తేదీల్లో కిరండూల్-విశాఖపట్నం(08552)పాసింజర్ రైలు కిరండూల్ నుంచి కాకుండా దంతేవాడ నుంచి బయల్దేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఆయా తేదీలలో ఈ రైళ్లు దంతేవాడ-కిరండూల్ మధ్య రాకపోకలు సాగించవు.

ఈ బాలుడు ఎవరో...!



రంపచోడవరం పోలీస్ స్టేషన్‌లో ఉన్న బాలుడు

రంప చోడవరం: ఈ ఫొటోలో ఉన్న మూడేళ్ల బాలుడిని రంపచోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తప్పిపోయాడని, ప్రస్తుతం ఈ బాలుడు రంపచోడవరం పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాడని ఎస్ఐ మోహన్‌కుమార్ తెలిపారు. బాలుడు తమ తల్లిదండ్రుల వివరాలు చెప్పలేకపోతున్నాడని, ఈ బాలుడి వివరాలు తెలిసిన వారు రంప చోడవరం పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

జీవ శిలీంద్రంతో చెక్..!



జీవ శిలీంద్రం తయారీని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త

- మిర్చిలో నల్లతామర పురుగు నివారణపై దృష్టి పెట్టిన ఎన్‌సీఐపీఎం
- దూగుట్టలో ఐదు ఎకరాల్లో మిర్చి పరిశోధన క్షేత్రం ఏర్పాటు
- క్షేత్రస్థాయిలో శాస్త్రవేత్తల పరిశోధనలు
- ఎప్పటికప్పుడు రైతులకు సూచనలు
- తగ్గుతున్న పురుగు ఉధృతి

విలీన మండలాల్లో మిర్చి రైతులకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్న నల్ల తామరపురుగుకు జీవ శిలీంద్రంతో అడ్డుకట్ట వేయవచ్చని నేషనల్ సెంట్రల్ ఫర్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ శాస్త్రవేత్తలు ప్రాథమికంగా గుర్తించారు. విలీన మండలాలైన కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక ప్రాంతాల్లో 4 వేల ఎకరాల్లో సాగు చేస్తున్న పైరుపై ఈ పురుగు ప్రభావం ఎక్కువగా ఉంది. దీనిపై స్పందించిన శాస్త్రవేత్తలు అరికట్టేందుకు చేపట్టిన కసరత్తు సత్ఫలితాలనిస్తోంది.

రంపచోడవరం: మిర్చి రైతులను నిండా ముంచుతున్న తామర పురుగును నివారించేందుకు ఎన్‌సీఐపీఎం (నేషనల్ సెంట్రల్ ఫర్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్) రంగంలోకి దిగింది. విలీన మండలాల్లో సాగు చేస్తున్న మిర్చి పైరుకు నల్లతామర పురుగు ఆశించడంతో 70 శాతం పంట దిగుబడి తగ్గిపోయింది. దీంతో మిరపకు తీవ్ర నష్టం కలిగిస్తున్న నల్లతామర పరుగు నివారణ చర్యల్లో భాగంగా పరిశోధనకు న్యూఢిల్లీకి చెందిన ఐసీఏఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్) ఆధ్వర్యంలో ఎన్‌సీఐపీఎం దేశంలో మూడు ప్రాంతాలను ఎంపిక చేసింది. వీటిలో ఉత్తరప్రదేశ్, కర్ణాటకతో పాటు జిల్లాలోని కూనవరం మండలం దూగుట్ట ప్రాంతం కూడా ఉంది.

అవసరానికి మించి పురుగు మందుల వినియోగంతో..

రాష్ట్రంలో గుంటూరు తరువాత విలీన మండలాల్లోనే మిరపను అధిక విస్తీర్ణంలో పండిస్తున్నారు. ఈ ప్రాంతంలో గతంలో నాలుగు వేల ఎకరాల్లో మిరపను సాగు చేసేవారు. దీంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోవడంతో రైతులు మిర్చి సాగును తగ్గించారు. అయితే నల్లతామర పురుగుతో మిర్చి పంటపై తీవ్ర ప్రభావం చూపింది. క్షేత్ర స్థాయి పరిశోధనలో భాగంగా ఒక్కో చోట ఐదు ఎకరాల్లో మిరప మొక్కలు నాటారు. వీటిపై నల్ల తామర పురుగు నష్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పంటల్లో అవసరానికి మించి పురుగు మందుల వాడకం కూడా పురుగు వ్యాప్తికి కారణంగా శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఇండోనేషియా ప్రాంతం నుంచి..

మిర్చిలో ఆశిస్తున్న నల్లతామర పురుగు ఇండోనేషియా ప్రాంతం నుంచి వచ్చినట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. మిర్చిలో దిగుబడి తగ్గిపోవడంతో నల్లతామర నివారణకు ఐసీఏఆర్ శాస్త్రవేత్తలు రంగంలోకి దిగారు. దూగట్టలో ఐదు ఎకరాల్లో మిరప నాటారు. ప్రస్తుతం మిరప కాయలు కోత దశకు వచ్చాయి. ఇటీవల ఎన్‌సీఐపీఎం న్యూఢిల్లీ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నారాయణభట్ దూగుట్టలోని మిరప పరిశోధన క్షేత్రాన్ని సందర్శించారు. మిరప మొక్కలను పరిశీలించారు. అలాగే ఆ ప్రాంతంలో మిరప సాగు చేస్తున్న రైతులతో మాట్లాడారు. మిరప పరిశోధన క్షేత్రంలో బెవేరియా బెస్సియానా, వెర్టిసీలియాట్ లికాని అనే జీవ శిలీంద్రాన్ని వాడుతున్నారు. మంచి ఫలితాలు వస్తుండటంతో మిరప రైతుల ఈ విధానం పాటిస్తున్నారు. మిరప పైరు చుట్టూ నీలి, పసుపు రంగు అట్టలను నల్లతామర పురుగులు ఆకర్షితమవుతున్నట్లు గుర్తించామని శాస్త్రవేత్తలు తెలిపారు. వీటి ఏర్పాటుతోపాటు అక్కడక్కడ మొక్కజొన్న నాటాలని రైతులకు సిఫార్సు చేసినట్టు వారు పేర్కొన్నారు.



మిరప పైరుకు నష్టం చేస్తున్న నల్ల తామర పురుగు

త్వరలోనే తామర పురుగుకు అడ్డుకట్ట



మిర్చిలో నల్లతామర పురుగు నివారణకు పరిశోధన చేసేందుకు దూగుట్టలో ఐదు ఎకరాలు మిరప క్షేత్రాన్ని ఎన్‌సీఐపీఎం బృందం ఏర్పాటు చేసింది. గత ఏడాది సర్వే నిర్వహించి మిరప మొక్కలు నాటారు. ఎన్‌సీఐపీఎం శాస్త్రవేత్తలు ఈ క్షేత్రాన్ని సందర్శించి రైతులకు అవసరమైన సూచనలిస్తున్నారు. నల్ల తామరపురుగు నివారణకు రైతులు అవసరానికి మించి పురుగు మందులు వాడుతున్నారు. దీనివల్ల పెట్టుబడి వ్యయం పెరిగి ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎన్‌సీఐపీఎం చేపట్టిన పరిశోధన ఫలితాలతో రైతులకు మేలు జరుగుతుంది. మిరపలో నల్లతామర పురుగును పూర్తిగా నివారించే రోజులు దగ్గరలోనే ఉన్నాయి.


–డాక్టర్ ఆదర్శ, కీటక శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, పందిరిమామిడి



దూగుట్టలో మిర్చి పరిశోధన క్షేత్రంలో సూచనలిస్తున్న ఎన్‌సీఐపీఎం శాస్త్రవేత్త

ఓటర్ల నమోదుపై ఇంటింటా సర్వే

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు



వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: జిల్లాలోని పీవీటీజీ ఓటర్ల నమోదుకు ఇంటింటా సర్వే జరపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు.మంగళవారం అధికారులతో నిర్వహించిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. రంపచోడవరం, పాడేరు డివిజన్ల పరిధిలోని పీవీటీజీ ఓటర్ల నమోదుపై సమీక్షించారు. వచ్చేనెల 8వతేదీ లోగా కొత్త ఓటర్ల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు.ఫారం 6బీ,7వీ సేకరణపై తహసీల్దార్లు ప్రత్యేకంగా శ్రద్ధ వహించాలని సూచించారు. గత మూడేళ్లలో మృతి చెందిన ఓటర్ల వివరాలను ఎంపీడీవోల నుంచి సేకరించాలని, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు ముద్రించిన ఓటరు జాబితాలను అన్ని రాజకీయ పార్టీలకు అందజేయాలని ఆదేశించారు. వారి నుంచి తగిన రసీదులను పొందాలని సూచించారు. ఈ నెల 25వతేదీన జాతీయ ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలని సూచించారు.

ప్రజలకు మెరుగైన సేవలు

అన్నిశాఖల అధికారులతో పాటు సచివాలయ వ్యవస్థ కూడా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుపెట్టి సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేసిందని పౌరసేవల విషయంలో జాప్యం చేయవద్దని కలెక్టర్ సూచించారు.జిల్లాలో భూముల రీసర్వేను వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. ఇప్పటికి 86 గ్రామాల్లో రీసర్వే,19 గ్రామాల్లో కోరిలేషన్ పనులు పూర్తి చేశారన్నారు. భూముల రికార్డులను ప్యూరిఫికేషన్ తరువాత 9(2)నోటీసులు ఇచ్చి గ్రామసభలు నిర్వహించాలని సూచించారు. విలేజ్ సర్వేయర్, వీఆర్వోలు లాగిన్‌లో భూముల సర్వే డేటాను సక్రమంగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ శివశ్రీనివాస్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్‌కలెక్టర్ అభిషేక్, సర్వేశాఖ ఏడీ మోహనరావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్ రద్దు చేయాలి

ఇంటర్ విద్యార్థినుల వినతి

అడ్డతీగల: ఇద్దరు ఉపాధ్యాయుల డిప్యుటేషన్ ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులు కోరుతున్నారు. 2022–2023 విద్యా సంవత్సరంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ప్రారంభించిన బాలికల జూనియర్ కళాశాలలో బైపీసీ గ్రూపులో 15 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. విద్యాబోధనకు అనువుగా అధ్యాపకులు రాలేదన్నారు. ఈపరిస్థితుల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న కె.కృష్ణారెడ్డి ఫిజిక్స్ సబ్జెక్ట్, ఎస్.విజయకుమారి బోటనీ సబ్జెక్ బోధిస్తున్నారన్నారు. ఆ ఇరువురుని ఇప్పుడు డిప్యుటేషన్ల పేరిట పేరిట అందుబాటులో లేకుండా చేస్తున్నారని విద్యార్థినులు పేర్కొన్నారు. మండలంలోని లాగరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కె.కృష్ణారెడ్డిని, కోరుకొండ మండలం బూరుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎస్.విజయకుమారిని డిప్యుటేషన్‌పై పంపిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు ఈనెల 22న ఉత్తర్వులు జారీచేశారన్నారు. వీటిని రద్దుచేసి ఆ ఇద్దరు ఉపాధ్యాయులు తమకు అందుబాటులో ఉండి బోధించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

యథేచ్ఛగా అడవుల నరికివేత

- చోద్యం చూస్తున్న అటవీశాఖ అధికారులు
- చర్యలు తీసుకుంటాం: సబ్ డీఎఫ్‌వో భరణి

రాజవొమ్మంగి: స్థానిక అటవీక్షేత్రపరిధిలో యథేచ్ఛగా అడవుల నరికివేత కొనసాగుతోంది. అడవిలోని విలువైన నల్లమద్ది, వేగిస, గుమ్మడి, వేప తదితర విలువైన భారీ చెట్లు నేల కూలుతున్నాయి. అక్రమార్కులు అడవులను నరికివేసి వంట చెరకుగా వినియోగించేందుకు తరలిస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి ప్రతిరోజూ సుమారు 10 టన్నుల ఎండు కలప, మరో 10 టన్నుల పచ్చి కలప తరలిపోతున్నట్లు అంచనా. స్థానిక అటవీఅధికారులు కళ్లెదుట జరుగుతున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి.



రాజవొమ్మంగి అటవీక్షేత్ర పరిధిలో నరికివేతకు గురైన విలువైన చెట్లు

దీనిపై మంగళవారం ఇక్కడికి వచ్చిన సబ్ డీఎఫ్‌వో భరణిని వివరణ కోరగా అడవులు నరికివేతకు గురౌతున్న విషయం తన దృష్టికి కూడా వచ్చిందన్నారు. అరికట్టేందుకు పటిష్ట మైన చర్యలు చేపడతామన్నారు.

గ్రంథాలయ ఉద్యోగులకు శుభవార్త

- పదేళ్ల తరువాత పదోన్నతులు
- ఇద్దరికి కారుణ్య నియామకం కింద శాశ్వత ఉద్యోగాలు
- చైర్‌పర్సన్ కొండా రమాదేవికి ఉద్యోగులు కృతజ్ఞతలు

దొండపర్తి(విశాఖ దక్షిణ): విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆ సంస్థ చైర్ పర్సన్ కొండా రమాదేవి శుభవార్త చెప్పారు. దాదాపు పదేళ్ల పాటు పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల సమస్యను పరిష్కరించారు. ఉద్యోగులకు పదోన్నతులు కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలపై కూడా ఉత్తర్వులు ఇచ్చి ఇద్దరికి శాశ్వత ఉద్యోగాలు కల్పించారు. ఈ సందర్భంగా మంగళవారం రామాటాకీస్ వద్ద గల జిల్లా గ్రంథాలయ సంస్థ కేంద్ర కార్యాలయంలో చైర్ పర్సన్ రమాదేవి ఉద్యోగులకు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం పదోన్నతి, ఉద్యోగాలు పొందిన వారికి ఆమె శుభాకాంక్షలు తెలిపారు. దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించిన చైర్‌పర్సన్ రమాదేవికి ఉద్యోగులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి(ఎఫ్ఏసీ) లలిత, ఇతర గ్రంథాలయ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



పదోన్నతులు పొందిన ఉద్యోగులతో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ కొండా రమాదేవి

పూర్తిస్థాయిలో హాజరు తప్పనిసరి

- లేకుంటే చర్యలు
- ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ
- 207 మందికి 43 మంది మాత్రమే ఉండటంపై మండిపాటు

ముంచంగిపుట్టు: విద్యార్థులందరూ పాఠశాలలో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ ఆదేశించారు. మండలంలోని లబ్బూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 207 విద్యార్థులకు కేవలం 43 మంది మాత్రమే ఉండడంపై ఉపాధ్యాయులపై పీవో ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్రాంతి పండగ సెలవులకు వెళ్లిన విద్యార్థులు ఇప్పటి వరకు రాకపోడంపై ఆయన మండిపడ్డారు. విద్యార్థులంతా రెండు రోజుల్లో పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ వార్డెన్ విధులు మూడు నెలలు పూర్తయినందున వేరొక ఉపాధ్యాయుడికి డిప్యూటీ వార్డెన్ బాధ్యతలు అప్పగించాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మెనూ అమలుపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని, విద్యార్థుల మూమెంట్ రిజిస్టర్ నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతీ ఉపాధ్యాయుడి ఫోన్ నెంబర్ ఆశ్రమ పాఠశాలలో ప్రదర్శించాలని సూచించారు. అనంతరం లబ్బూరులో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించారు. త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. అనంతరం రాత్రి 7గంటల సమయంలో ముంచంగిపుట్టు సీహెచ్‌సీని సందర్శించారు. విద్యార్థుల హెల్త్‌సెల్, ఎక్స్‌రే గది, బ్లడ్ బ్యాంక్‌లను తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆస్పత్రి పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రతీ విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని వైద్యులకు సూచించారు.



లబ్బూరులో రికార్డులు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ

సమస్యల పరిష్కారానికి చీఫ్ ఇంజినీర్ హామీ

మోతుగూడెం: సీలేరు కాంప్లెక్సులో ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చీఫ్ ఇంజినీర్ బొడ్డు శ్రీధర్ హామీ ఇచ్చారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయనను 1104 యూనియన్ రీజినల్ మరియు బ్రాంచ్ కార్యవర్గం, కార్మికులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లారు. కార్మికులకు యూనిఫాం, షూస్, రెయిన్ కోట్ అందచేయాలని, డిపార్ట్‌మెంట్ క్వార్టర్లలో సివిల్ వర్కులు చేపట్టాలని కోరారు. మినరల్ వాటర్ ప్లాంట్ పునరుద్ధరించి మంచినీరు పంపిణీ చేపట్టడమే కాకుండా చిల్డ్రన్ పార్కు, లైటింగ్, ఆట వస్తువులు మరమ్మతులు చేపట్టాలని విన్నవించారు. వీటితోపాటు రిటైర్డ్, చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు డిపార్ట్‌మెంట్ క్వార్టర్లను అద్దె ప్రాతిపదికన కేటాయించాలని కేటాయించడమే కాకుండా జెన్‌కో ఆస్పత్రిలో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని విన్నవించారు. దీనిపై చీఫ్ ఇంజినీర్ సానుకూలంగా స్పందించారు.పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు.



సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజినీర్‌ను కలిసిన కార్మికులు

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

- బాధ్యతగా డ్రైవింగ్
- పరిమితికి మించి ఎక్కిస్తే చర్యలు
- వాహన డ్రైవర్లకు జిల్లా రవాణాశాఖాధికారి లీలాప్రసాద్ హెచ్చరిక

పాడేరు రూరల్: రోడ్డు ప్రమాదాలు నివారణే లక్ష్యంగా వాహనాలు నడపాలని జిల్లా రవాణా శాఖ అధికారి ఎస్.లీలాప్రసాద్ సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ముగింపు కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా పట్టణంలోని తలార్‌సింగి నుంచి సినిమాహాల్ జంక్షన్ మీదుగా పాత బస్టాండ్ అంబేడ్కర్ కూడలి వరకు ఆటోలతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రయివేటు వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులకు ఎక్కించుకొని మితిమీరిన వేగంతో ప్రయాణాలు చేయవద్దని సూచించారు. ఆటో డ్రైవర్లు పాఠశాల విద్యార్థులకు ఎక్కించుకునే డ్రైవర్లు వారి పట్ల బాధ్యత వహించాలని సూచించారు. ర్యాష్, డ్రంకన్ డ్రైవ్ చేయవద్దన్నారు. డ్రైవర్లు విశ్రాంతి లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ప్రమాదాలు జరిగితే ప్రథమ చికిత్స అందించాలని కోరారు. వాహనాల్లో చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని, ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. సహాయ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె. వాసు, డాక్టర్ శ్రీకాంత్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



పాడేరులో ఆటో ర్యాలీని ప్రారంభిస్తున్న ఆర్టీవో లీలాప్రసాద్

సైకియాట్రిస్ట్ పోస్టు భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్: పాడేరు జిల్లా ఆస్పత్రిలోని డ్రగ్ డిఅడిక్షన్ సెంటర్‌లోని తాత్కాలిక పద్ధతిలో సైకియాట్రిస్ట్ పోస్టు భర్తీకి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. జీతం నెలకు రూ.60వేలు, ఆసక్తిగల వైద్యులు తమ పూర్తి బయోడేటాతో ఈనెల 28 తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా జిల్లా ఆస్పత్రిలో అందజేయాలని ఆయన కోరారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను డంప్ చేయొద్దు

రంపచోడవరం సబ్ డీఎఫ్‌వో భరణి



మాట్లాడుతున్న రంపచోడవరం సబ్ డీఎఫ్‌వో భరణి

రాజవొమ్మంగి: ప్లాస్టిక్ తదితర వ్యర్థాలను రక్షిత అటవీప్రాంతంలో డంప్ చేయవద్దని రంపచోడవరం డివిజన్ సబ్ డీఎఫ్‌వో భరణి సూచించారు. సబ్‌డీఎఫ్‌వోగా బాధ్యతలు చేపట్టిన ఆమె మంగళవారం అటవీ క్షేత్ర కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. అటవీ ప్రాంతాల్లో వేస్తున్న వ్యర్థాల వల్ల అగ్నిప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.. అనంతరం విలేకరులతో మాట్లాడుతు గుడిసె వంటి పర్యాటక ప్రాంతాల్లో సిబ్బందిని నియమించి ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించే పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. అయినప్పటికీ ఎక్కడ చూసినా ప్లాస్టిక్ తదితర వ్యర్థాలు పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తున్న అంశం అన్నారు. ఉన్నటువంటి అడవిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చెట్ల అక్రమ నరికివేత, కలప రవాణాపై డివిజన్‌వ్యాప్తంగా బేస్‌క్యాంప్ సిబ్బంది 11 స్థావరాలు ఏర్పాటు చేసి రేయింబవళ్లు కాపాలా కాస్తున్నారన్నారు. సిబ్బంది కొరత కూడా ఉందన్నారు. రేంజ్ అధికారి అబ్బాయిదొర తదితరులు పాల్గొన్నారు.

గిరి విద్యార్థుల ఆరోగ్యమే ఐటీడీఏ లక్ష్యం

- 158 విద్యాలయాల్లో వైద్యపరీక్షలు
- 58వేల మంది గిరిజన విద్యార్థులకు మేలు

సాక్షి, పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలోని 158 గిరిజన విద్యాలయాల్లో సుమారు 58వేల మంది గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో పాడేరు ఐటీడీఏకు సంబంధించి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలు, పోస్టు మెట్రిక్ కాలేజీ హాస్టళ్లలో గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల కొన్ని ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులు అనారోగ్యానికి గురవడం, పలు చోట్ల మరణాలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలోని గిరిజన విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, పరీక్షల నివేదిక ఆధారంగా వైద్య ఆరోగ్య కార్యక్రమాలను విస్తృతం చేసే లక్ష్యంతో ఐటీడీఏ ప్రత్యేక చర్యలు చేపడుతుంది. ఈ మేరకు గిరిజన విద్యార్థులకు వైద్య పరీక్షలను మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రారంభించింది. పాడేరు ఐటీడీఏ పరిధిలోని 36 ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది, సచివాలయాల ఏఎన్ఎంలతో పాటు, అనకాపల్లి, విశాఖ నగర పరిధిలోని పీహెచ్‌సీల వైద్య బృందాలు మూడు రోజుల్లో విద్యార్థులకు వైద్యపరీక్షలు పూర్తి చేయాలనే ఐటీడీఏ నిర్ణయించింది. ప్రతి గిరిజన విద్యార్థికి ఆరోగ్య కార్డును జారీ చేసి, అందులో ఆరోగ్య నివేదికను పొందుపరచనున్నారు. తమ పిల్లలకు పూర్తి స్థాయిలో వైద్యపరీక్షలు నిర్వహిస్తుండడంపై తల్లిదండ్రులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వైద్యపరీక్షలు తొలిరోజు విజయవంతమయ్యాయి.


లోచలిపుట్టు పాఠశాలలో విద్యార్థికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్



బందవీధిలో విద్యార్థినిని పరీక్షిస్తున్న డాక్టర్ రవిచంద్రశేఖర్, పర్యవేక్షిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

విద్యార్థులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

హుకుంపేట: ఏజెన్సీలోని విద్యాలయాల్లో విద్యార్థులకు తప్పనిసరిగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్ చెప్పారు. ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని పెదగరువు ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 510మంది విద్యార్థులకు గాను 247 మందికి వైద్య పరీక్షలు చేశారు. రక్తహీనత, చర్మవ్యాధులు, కంటి వ్యాధి, తక్కువ బరువు తదితర వ్యాధులతో బాధపడుతున్న 26 మంది విద్యార్థులను గుర్తించి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు పాడేరు డివిజన్ మండలాల పరిధిలోని విద్యాలయాల్లో త్వరితగతిన వైద్య పరీక్షలు పూర్తి చేయాలన్నారు. సికిల్‌సెల్ ఎనీమియా కేసులను గుర్తించి తదుపరి పరీక్షల కోసం ఉన్నత ఆస్పత్రులకు పంపించాలని సూచించారు. అన్ని వ్యాధులకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచాలని, వైద్యాధికారి సిబ్బంది విధిగా శిబిరాల్లో పాల్గొవాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సుమన, పాడేరు జిల్లా ఆస్పత్రి టీఈజీ మేనేజర్ కిశోర్, పాడేరు ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణ అధికారి సింహాద్రి, నాగరాజు తదితరులున్నారు.

జి.మాడుగుల: మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ బందవీధి గిరిజన సంక్షేమ బాలిక ఆశ్రమోన్నత పాఠశాల బాలికలకు డీఎంహెచ్‌వో జమాల్ బాషా ఆధ్వర్యంలో మంగళవారం వైద్య పరీక్షలు చేపట్టారు. మూడు నుంచి ఆరవ తరగతి విద్యార్థులు 90 మందికి ఐయోడైజ్డ్, యూరిన్ పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రవిచంద్రశేఖర్ శశికాంత్, ఆరోగ్య విస్తరణాధికారి నడిగట్ల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షల నివేదికతో మరింత మెరుగైన వైద్యం



గిరిజన విద్యార్థులకు వైద్య పరీక్షలను విజయవంతంగా నిర్వహిస్తాం. వైద్యులు, వైద్యబృందాలు ప్రతి విద్యార్థికి స్క్రీనింగ్ పరీక్షలు చేసి నివేదికలను తమకు అందజేస్తారు. గిరిజన విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని బట్టి అవసరమైన మేరకు మెరుగైన ఉన్నత వైద్యసేవలు కల్పిస్తాం. గిరిజన విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా ఐటీడీఏ పనిచేస్తుంది.

-ఆర్.గోపాలకృష్ణ, ఐటీడీఏ పీవో, పాడేరు

గురుకుల కళాశాల విద్యార్థి అదృశ్యం


సంతోష్‌కుమార్

జి.మాడుగుల: స్థానిక గురుకులం జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న కొర్రా సంతోష్‌కుమార్ కొన్ని రోజుల నుంచి కన్పించడం లేదని, పాఠశాల యాజమాన్యం, విద్యార్థి తండ్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. పాడేరు మండలం మినుములూరు గ్రామానికి చెందిన కొర్రా సంతోష్‌కుమార్ దసరా సెలవుల అనంతరం కళాశాలకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడని అన్నారు. కళాశాలలో తమ కొడుకు చదువుకుంటున్నాడని తల్లిదండ్రులు భావించారని అన్నారు. అయితే సంతోష్‌కుమార్ గైర్హాజరుపై కళాశాల యాజమాన్యం మినుములూరులోని సంతోష్‌కుమార్ తల్లిదండ్రులను సంప్రదించడంతో విద్యార్థి అదృశ్యమైన విషయం బయటపడిందని అన్నారు. కళాశాలకు బయలుదేరిన సంతోషకుమార్ గ్రామంలో కానీ, గురుకుల కళాశాలలో లేకపోవడంతో అతని ఆచూకీ కోసం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. సంతోష్‌కుమార్ ఆచూకీ తెలిస్తే సీఐ: 9440904222, ఎస్ఐ:9440904221 నంబర్లకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

కలుపు నివారణపై రైతులకు సూచనలు


రైతులకు కలుపు నివారణ మందును అందిస్తున్న శాస్త్రవేత్తలు

దేవీపట్నం: రబీ మొక్కజొన్న పంటలో కలుపు నివారణపై ప్రథమ శ్రేణి ప్రదర్శన నిర్వహించారు. కాకినాడ జిల్లా పెద్దాపురం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ పరిశోధన స్థానం, అఖిలభారత మొక్కజొన్న పరిశోధన సమన్వయ పథకం విభాగంలో శాస్త్రవేత్తల బృందం మంగళవారం ఇందుకూరుపేటలోని మొక్కజొన్న పంటలను పరిశీలించారు. పరిశోధన స్థానాల్లో జరిగిన ప్రయోగాల్లో వెలువడిన ఫలితాలను శాస్త్రవేత్త డాక్టర్ పి.మునిరత్నం రైతులకు వివరించారు. మొక్కజొన్న పంటలో మొదటి 3 నుంచి 4 వారాల వరకూ పెరుగుదల నెమ్మదిగా ఉంటుందని, 6 వారాల లోగా కలుపు పెరుగుదలను అరికట్టి పంటకు నష్టం కలుగకుండా చూడాలన్నారు. గడిచిన మూడేళ్లుగా కలుపు నివారణపై జరిపిన అధ్యయనంలో విత్తిన 15 రోజుల తర్వాత టెంబోట్రియోన్ 120 గ్రాములను 750 గ్రాముల అట్రాజిన్‌ను కలిపి ఒక హెక్టారుకు పిచికారీ చేయాలని సూచించారు. రైతులకు కలుపు నివారణ మందును అందించి పలు సూచనలిచ్చారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఐ.సుధీర్ కుమార్, శ్రీమతి వి.సుజాత, మండల వ్యవసాయాధికారి ప్రశాంతి, వీఏఏ అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్

అరకులోయ రూరల్: ఓటు హక్కుపై యువత అవగాహన కలిగి ఉండాలని పాడేరు సబ్ కలెక్టర్ అభిషేక్ అన్నారు. మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు, వినియోగంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ అభిషేక్ మాట్లాడుతూ అర్హులందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలను పరిశీలించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ భరత్‌కుమార్‌నాయక్, వైస్ ప్రిన్సిపాల్ పద్మలత, ఉమెన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ రామకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ చలపతిరావు, సిబ్బంది నాగబాబు, సుజాత, అనిత తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి ఒకరు మృతి

ఏడుగురికి తీవ్ర గాయాలు


సొలభం ఘాట్ రోడ్డులో లోయలోకి దూసుకుపోయిన ఆటో

జి.మాడుగుల: సొలభం-జి.మాడుగుల రోడ్డు మార్గంలో సొలభం కామెటమ్మ ఘాట్‌లో మంగళవారం ఆటో లోయలోకి దూసుకుపోయి బోల్తాపడిన సంఘటనలో ఒకరు మృతి చెందగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలో గొడ్డ, సొలభం, పచ్చనాపల్లి గ్రామాలకు చెందిన గిరిజనులు ఆటోలో జి.మాడుగుల సంతబయలు గ్రామంలో జరుగుతున్న వారపు సంతకు వస్తుండగా మార్గ మధ్యలో సొలభం ఘాట్‌లో ఆటో అదుపుతప్పి ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో గొడ్డ గ్రామానికి చెందిన తల్లాబు నూకరాజు, పోతురాజు, సొలభం గ్రామానికి చెందిన రీమెలి పూర్ణమ్మ, చెందా కొండమ్మ, సొలభం పార్వతమ్మ, సొలభం కొండబాబునాయుడు, పచ్చనాపల్లి గ్రామానికి చెందిన అరుకు బాలయ్య(ఆటో డ్రైవర్) తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ప్రయివేటు వాహనాల్లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శశికాంత్, వైద్య సిబ్బంది వైద్యం అందించారు. మెరుగైన వైద్యం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి అంబులెన్సుల్లో తరలించారు. పాడేరు ఆస్పత్రి నుంచి పచ్చనాపల్లి గ్రామానికి చెందిన కూడా సన్యాసిరావును 108వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఆటో ప్రమాదంలో గాయపడిన వారితో సీఐ సత్యనారాయణ, తహసీల్దార్ కె.అప్పలస్వామి, ఎస్‌ఐ శ్రీనివాస్ మాట్లాడి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద బాధితులను సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు, సొలభం సర్పంచ్ ఐసరం హనుమంతరావు పరామర్శించారు. ఆటో ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు

ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడి పరామర్శ

పాడేరు రూరల్: సొలభం ఘాట్‌లో ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు కల్పించాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు వైద్యులకు సూచించారు. పాడేరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను మంగళవారం సాయంత్రం ఆయన పరామర్శించారు. ఆయన వెంట జి.మాడుగుల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం కన్వీనర్ లంకెల కళ్యాణం ఉన్నారు.

చలిగాలుల విజృంభణ

సాక్షి,పాడేరు: జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. చలిగాలులు విజృంభిస్తున్నాయి. అర్ధరాత్రి వేళల్లో పొగమంచు దట్టంగా కురుస్తోంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతుండడంతో చలితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చింతపల్లిలో ఉష్ణోగ్రతలు ఒక్కరోజులోనే పడిపోయాయి. సోమవారం 7 డిగ్రీలు నమోదవ్వగా, మంగళవారం 4.8 డిగ్రీలు నమోదైనట్టు చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ విభాగం తెలిపింది. అలాగే అరకులోయలో 6.5,పాడేరు మండలం మినుములూరులో 9డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.వేకువజాము వరకు పొగమంచు కురుస్తున్నప్పటికి ఉదయం 8గంటల సమయంలో సూర్యోదయం అవుతుంది.

ఐస్ మాదిరిగా గడ్డకట్టి..

సంక్రాంతి పండగ ముందు ఏజెన్సీలో పలుచోట్ల మంచు ఐస్‌లా గడ్డకట్టింది. అయితే మంగళవారం ఉదయం పాడేరు నీలకంఠనగర్ నుంచి తుమ్మరమెట్ట పోయే రోడ్డులోని పంట భూముల వద్ద వరిగడ్డిపై తేలికపాటిగా మంచు ఐస్‌ను తలపించింది. చలితీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు చలిమంటలను ఆశ్రయించారు.

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలో మంగళవారం కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆంధ్రా కశ్మీర్ లంబసింగిలో మంచు దట్టంగా కురిసింది. వర్షాన్ని తలపించే మంచులో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పర్యాటకులు కూడా మంచు వర్షానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

నర్సీపట్నం: స్కూటీలో గంజాయి తీసుకువెళ్తున్న వ్యక్తిని టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టౌన్ ఎస్‌ఐ ధనుంజనాయుడు తెలిపారు. డిగ్రీ కళాశాల మెయిన్ రోడ్డులో స్కూటీని ఆపి తనిఖీ చేయగా 2 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు.తరలిస్తున్న సుర్ల అర్జున్‌ను అరెస్టు చేశామని మంగళవారం ఆయన తెలిపారు.

పశువుల దొంగలను పట్టుకున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మేతకు వెళ్లి పశువులను అపహరిస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మినుములపుట్టు, జంగం సరియా గ్రామాల గిరిజనులు డిమాండ్ చేశారు. మంగళవారం పలు గ్రామాల గిరిజనులు పశువుల అపహరణ చేస్తున్న వ్యక్తులను పట్టుకొని స్థానిక పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా మినుములపుట్టు, జంగంసరియా గ్రామాల గిరిజన రైతులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా గ్రామ సమీపంలో మేతకు వెళ్లిన 11 పశువులు అపహరణకు గురయ్యాయని, దీంతో ఆరా తీయగా మినుములపుట్టు గ్రామానికి చెందిన సొనియా కొమటి, ముంచంగిపుట్టు గ్రామానికి చెంది తాపీ మేస్త్రీ సత్తిబాబు, మరికొంత మంది వ్యక్తులు మేతకు వెళ్లిన పశువులను అపహరించి వాటిని చంపి మాంసాన్ని మినుములపుట్టు గ్రామ కొండ ప్రాంతంలో విక్రయం చేస్తున్నట్టు గుర్తించామని, వారిని పట్టుకుని పోలీసుస్టేషన్‌కు అప్పగించామని తెలిపారు. నిందితులపై గోహత్య నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మినుములపుట్టు, జంగంసరియా గ్రామ రైతులు కిముడు గాసిరావు, ఎం.హరి, వి.అప్పారావు, కె.అర్జున్, ధర్మరావు, నారాయణ, గాసిరావుదొర డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న మినుములపుట్టు, జంగం సరియా గ్రామస్తులు

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడి

ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ శివకుమార్



పాడేరు రూరల్: గిరి రైతులు వ్యవసాయ పద్ధతుల్లో ఆధునిక విధానాలను అవలంభించడం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని చింతపల్లి ఉద్యానవన పరిశోధన స్థానం శాస్త్రవేత్త డా.వి.శివకుమార్ సూచించారు. కలెక్టరేట్ మందిరంలో కేంద్ర స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలోని నిర్వహించిన సుగంధ ద్రవ్య పంటల సాగుపై మంగళవారం నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన పలు సూచనలు చేశారు. ఐటీడీఏ రాయితీపై అందిస్తున్న అత్యాధునిక వ్యవసాయ పరికరాలను ఉపయోగించుకుని ఆధునిక పద్ధతుల్లో సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కాఫీ తోటలు తక్కువగా ఉన్న చోట అంతర పంటగా పన్నీర్-1 మిరియాలు సాగుచేసుకుంటే మంచి దిగుబడి పొందవచ్చన్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా పసుపులోని రోమా, ప్రగతి, దేశవాళి గిరిజన రైతులు సాగుచేస్తున్నారన్నారు. స్పైసెస్‌బోర్డు సీనియర్ ఫీల్డ్ అధికారి కల్యాణి మాట్లాడుతూ ఉద్యానవన వ్యవసాయాధికారులు శిక్షణను సద్వినియోగం చేసుకుని రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ చట్టపరంగా నష్టపరిహారం


గ్రామసభలో భూ రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ శుభం బన్సల్

రాజవొమ్మంగి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఎన్‌హెచ్-516 రహదారి భూ నిర్వాసితులతో సబ్ కలెక్టర్ శుభం బన్సల్ సమక్షంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. భూసేకరణ, నష్టపరిహారం తదితర అంశాలపై చర్చించారు. దూసరపాము, రాజవొమ్మంగి, సూరంపాలెం గ్రామాలకు చెందిన భూమి, ఇళ్లు నష్టపోతున్న యజమానులను గ్రామసభకు ఆహ్వానించి వాస్తవ పరిస్థితులపై ఆరా తీశారు. బాధిత రైతులకు చెందిన పట్టాదార్ పాస్‌పుస్తకాలు, దస్తావేజులు, భూ హక్కు పత్రాలను పరిశీలించారు. వట్టిగెడ్డ రిజర్వాయర్ ఆయకట్టు కింద ఉన్న భూముల్లో రెండు పంటలు పండిస్తున్నామని, రోడ్డు నిర్మాణంలో కోల్పోతున్న భూములకు సంబంధించి ఎకరాకు రూ.20లక్షలు చెల్లించాలని సబ్ కలెక్టర్‌కు బాధిత రైతులు విన్నవించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ శుభం బన్సల్ మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల దృష్ట్యా జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోందని, భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు పూర్తి న్యాయం చేస్తూ నష్టపరిహారం చెల్లించనున్నట్టు తెలిపారు. శరభవరంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి, డీటీలు శ్రీధర్, సత్యనారాయణ, వీఆర్వోలు భారతి, సూర్యాకాంతం, దాక్షాయని, రామదాసు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ నిర్వహణ అభినందనీయం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- 'సాక్షి'ప్రీమియర్ లీగ్ పోటీలు ప్రారంభం


బంతిని బలంగా బాదుతున్న బ్యాటర్


టోర్నీ ప్రారంభమ్యాచ్‌లో తలపడిన జట్లతో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి

విశాఖ స్పోర్ట్స్: యువతను ప్రోత్సహించేందుకు 'సాక్షి' మీడియా ఏటా క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో 'సాక్షి'ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఇదొక మంచి వేదిక అని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి.. ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. 'సాక్షి'బ్యూరో చీఫ్ రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ ఆటగాళ్లకు ఫిట్‌నెస్ ముఖ్యమన్నారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. సర్క్యులేషన్ ఏజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏటా క్రికెట్ పోటీలతో పాటు సామాజిక బాధ్యతగా పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం మేయర్ కాసేపు బ్యాటింగ్ చేసి ఆటగాళ్లలో ఉత్సాహం నింపారు. టాస్ వేసి పోటీలను ప్రారంభించి.. ప్రారంభ పోటీలో పాల్గొన్న ఇరు జట్లను పరిచయం చేసుకున్నారు. ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్‌మాల్ డిస్ట్రిక్ట్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

తొలి రోజు విజేతలు వీరే..

సాక్షి ప్రీమియర్ లీగ్(ఎస్పీఎల్) జూనియర్స్ విభాగం ప్రారంభ మ్యాచ్‌లో శ్రీకశ్యప్ జూనియర్ కళాశాల జట్టు 20 పరుగుల తేడాతో ఆళ్వార్‌దాస్ పాలిటెక్నిక్ జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కశ్యప్ కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. భరత్ 23, ఆర్.దుర్గాప్రసాద్ 22 పరుగులు చేశారు. విష్ణు రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా ఆళ్వార్‌దాస్ జట్టు ఐదు వికెట్లు కోల్పోయి 72 పరుగులే చేసింది. బాలచంద్ర 27 పరుగులు చేశాడు.

- మరో మ్యాచ్‌లో ఎస్‌వీఎల్ఎన్ఎస్‌వీపీ(గోపాలపట్నం) కళాశాల జట్టు 18 పరుగుల తేడాతో ఏవీఎన్ పాలిటెక్నిక్ జట్టుపై విజయం సాధించింది. ఎస్‌వీఎల్ఎన్ఎస్‌వీపీ 75 పరుగులకు ఆలౌటైంది. ప్రతిగా ఏవీఎన్ పాలిటెక్నిక్ 57 పరుగులకే ఇన్నింగ్స్ ముగించింది. మురళీ రెండు, సల్మాన్ మూడు వికెట్లు తీశారు.
- తొలి రోజు చివరి మ్యాచ్‌లో ప్రభుత్వ పాలిటెక్నిక్(కంచరపాలెం) జట్టు ఏడు వికెట్ల తేడాతో వీఎస్ కృష్ణా కళాశాల జట్టుపై విజయం సాధించింది. వీఎస్ కృష్ణా కళాశాల ఏడు వికెట్లు కోల్పోయి 73 పరుగులు చేసింది. సురేష్ 30 పరుగులు చేశాడు. రిషి రెండు వికెట్లు తీశాడు. ప్రతిగా ప్రభుత్వ పాలిటెక్నిక్ జట్టు మూడు వికెట్లు కోల్పోయి విజయలక్ష్యాన్నందుకుంది. సాయిగణేష్ 40 పరుగులు చేశాడు.


విజేతలు వీరే.. శ్రీకశ్యప్ కళాశాల జట్టు


ఎస్‌వీఎల్ఎన్ ఎస్‌వీపీ కళాశాల జట్టు


ప్రభుత్వ పాలిటెక్నిక్, కంచరపాలెం జట్టు